క్లుప్తంగా

పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు తీసుకోండి

మచిలీపట్నంటౌన్: సర్వజన ఆసుపత్రిలో పారిశుద్ధ్యం మెరుగ్గా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని డెప్యూటీ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు పారిశుద్ధ్య నిర్వహణ పర్యవేక్షకులకు సూచించారు. ఆసుపత్రిలోని సూపరింటెండెంట్ చాంబర్‌లో ఆయన పర్యవేక్షకులతో సమావేశమయ్యారు. ఆసుపత్రి ఆవరణలో పిచ్చిమొక్కలు, గడ్డి తొలగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆసుపత్రి ఆవరణను పరిశుభ్రంగా ఉంచేందుకు కార్మికులకు సూచనలు ఇచ్చి పనిచేయించాలని ఆదేశించారు. సమావేశంలో ఆసుపత్రి కార్యాలయ సూపరింటెండెంట్ వడ్డి రమేష్ పాల్గొన్నారు. అనంతరం ఆసుపత్రిలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను ఆయన పరిశీలించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



కోడూరు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో కోడూరుకు చెందిన లక్ష్య స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఈనెల 17న విజయవాడ పటమటలోని జెడ్పీ హైస్కూలులో పోటీలు జరిగాయి. అండర్–14 బాలుర విభాగంలో విద్యార్థులు అయ్యప్ప, డానియేల్ వాలీబాల్‌లో సత్తాచాటారు. నవంబర్ 9 నుంచి 12 వరకు విజయనగరంలోని భోగాపురంలో జరిగే రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో ఈ ఇద్దరు విద్యార్థులు పాల్గొంటారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ విన్నంశెట్టి శివనాగరాజు, వ్యాయామ ఉపాధ్యాయుడు శొంటి నాగరాజు, ఉపాధ్యాయులు అభినందించారు.

జిల్లాలో టెట్ పరీక్ష ప్రశాంతం

పెడన: జిల్లా వ్యాప్తంగా శుక్రవారం మధ్యాహ్నం ఏర్పాటు చేసిన మూడు పరీక్షా కేంద్రాల్లో టెట్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. రెండో సెషన్ మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగిన మూడు పరీక్షా కేంద్రాల్లో 1,335 మందికి గాను 1,142 మంది హాజరవగా 193 మంది హాజరవలేదు. ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి, డీఈవో కార్యాలయం ఏడీ మనోహార్ నాయక్ పరీక్షా కేంద్రాలను సందర్శించారు. పెడన నందమూరు పరీక్షా కేంద్రంలో చీఫ్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ బీఆర్ఎస్‌రెడ్డి, అడ్మిన్ పి.అశోక్ కుమార్ పర్యవేక్షించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పరీక్ష ప్రశాంతంగా జరిగిందని వారు తెలిపారు.

పంచాయతీకి మార్చురీ బాక్సు వితరణ

లంకపల్లి(ఘంటసాల): మండలంలోని లంకపల్లి గ్రామానికి చెందిన యార్లగడ్డ నాగ మునేశ్వరరావు తల్లిదండ్రులు యార్లగడ్డ వెంకట సుబ్బయ్య – మీనమ్మ జ్ఞాపకార్థం మార్చురీ బాక్సును పంచాయతీకి వితరణగా అందించారు. మార్చురీ బాక్సు పంచాయతీకి ఉచితంగా ఇవ్వడంతో పాటు మెయింటెనెన్స్ ఖర్చులు కూడా భరిస్తానని హామీ ఇచ్చిన దాత యార్లగడ్డ నాగ మునేశ్వరరావును సర్పంచ్ డి.విజయలక్ష్మి, పాలకవర్గ సభ్యులు అభినందించి కృతజ్ఞతలు తెలియజేశారు. పంచాయతీ కార్యదర్శి కె.నాగ నాంచారమ్మ, పాలకవర్గ సభ్యులు, నాగమునేశ్వరరావు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వర్గపోరుకు వేదికగా ‘పల్లె పండుగ’



నాగాయలంక: పల్లె పండుగ వారోత్సవాల సందర్భంగా నాగాయలంకలో శనివారం జరిగే కార్యక్రమం టీడీపీ నేతల వర్గపోరుకు వేదిక కాబోతుందా? రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన శిలాఫలకాలు ఏర్పాటు చేసిన తీరుతో ఇది నిజమే అనిపిస్తోంది. అవనిగడ్డ ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ జనసేన పార్టీ అయినప్పటికీ గ్రామ పంచాయతీ టీడీపీ అధీనంలో ఉంది. అయితే నాగాయలంకపై పట్టు(ఆధిపత్యం)సాధించే క్రమంలో ఇప్పటి వరకు అంతర్గతంగా ఉన్న టీడీపీ నేతల పోరు శుక్రవారం సాయంత్రం నిర్మించిన రెండు శంకుస్థాపన శిలాఫలకాలు రసవత్తర రాజకీయ చర్చగా మారింది. ఈ పరిస్థితుల్లో ఎమ్మెల్యే హాజరవుతారా లేదా అనేది చర్చనీయాంశంగా మారింది. గ్రామంలో 723 మీటర్ల పొడవైన ఏడు సీసీ రోడ్లను శనివారం శంకుస్థాపన చేయనున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థానిక గ్రామ కార్యదర్శి ఆధ్వర్యంలో ఇందుకోసం శిలాఫలం నిర్మించారు. కాగా ఇదే కార్యక్రమానికి ఆ పక్కనే మరో శిలఫలకం దిమ్మె ఏర్పాటు చేశారు. టీడీపీ వర్గ పోరులో ఉన్న ఇరువురు నేతల్లో ఉపసర్పంచ్ తలశిల నాని పంచాయతీ ఉపసర్పంచ్‌గా ఉన్నారు. మరో నేతగా మాజీ సర్పంచ్ మండవ బాలవర్ధిరావు తనదైన శైలిలో పావులు కదుపుతూ ఈ రెండో శిలాఫలకం నిర్మాణం చేయించారు. పరిస్థితి ఎలా ఉంటుందనేది చర్చనీయాంశంగా మారింది.

లక్ష్యానికి చేరువగా ఈకేవైసీ

- పెడన నియోజకవర్గంలో 58,440 ఎకరాల లక్ష్యం
- ఈకేవైసీకి ముందుకు రాని 7,056 మంది రైతులు
- అత్యధికంగా పెడన మండలం.. అత్యల్పంగా కృత్తివెన్ను



నడుపూరులోని పొలం

పెడన: నియోజవర్గంలో 51,245 ఎకరాల్లో రైతులు ఈకేవైసీ చేయించారు. పంట వేసిన రైతు ఈకేవైసీ చేయించుకుంటేనే రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు అర్హులని అధికారులు చెబుతున్నారు. ముందు పంట నష్టం నమోదు చేసినా తర్వాత తప్పనిసరిగా ఈకేవైసీ చేయించాల్సిందేనని అధికారులు స్పష్టం చేశారు. ప్రతి రైతూ ఈకేవైసీ చేయించుకునేలా వ్యవసాయ శాఖాధికారులు చర్యలు తీసుకోవడంతో క్షేత్రస్థాయిలోని వీఏఏలు, ఎంపీవోలు పరుగులు పెట్టారు. సెప్టెంబరు 15తో గడువు ముగిసిందని తొలుత పేర్కొన్న అధికారులు భారీ వర్షాలతో పంటలు ముంపు బారిన పడ్డాయి. దీంతో ఆ గడువును సెప్టెంబరు 30వ తేదీ వరకు పొడిగించారు. ఆ తర్వాత మళ్లీ అక్టోబరు 9 వరకు పొడిగించి ఈకేవైసీ ప్రక్రియను ముగించారు. నియోజకవర్గంలోని పెడన, గూడూరు, బంటుమిల్లి, కృత్తివెన్ను నాలుగు మండలాల్లో 58,440 ఎకరాలకు 34,352 మంది రైతులున్నారు. వీరిలో 27,269 మంది రైతులు వారికి సంబంధించిన 51,245 ఎకరాల్లో ఈకేవైసీ చేయించారు. 7,083 మంది రైతులు 7,195 ఎకరాలకు ఈకేవైసీ చేయించాల్సి ఉంది. వీరు స్థానికంగా లేకపోవడం, ఫోన్ చేసినా స్పందించకపోవడం, ఇళ్లకు వెళ్లినా కొందరు ఆసక్తి చూపించకపోవడం వంటి కారణాలు వ్యవసాయశాఖ పేర్కొంటోంది. 139 మంది రైతుల ఈకేవైసీ పరిశీలనలో ఉన్నాయి.

మండలాల వారీగా పరిశీలిస్తే..

పెడన మండలంలో అత్యధికంగా వ్యవసాయంతో పాటు హార్టికల్చర్ సాగు చేశారు. మొత్తం 20,815 ఎకరాలను 13,080 మంది రైతులు సాగు చేశారు. వీరిలో 9,827 మంది రైతులు 17,256 ఎకరాలను ఈకేవైసీ చేయించారు. 3,253 మంది రైతులు 3,481 ఎకరాలను ఈకేవైసీ చేయించడానికి ముందుకు రాలేదు. గూడూరు మండలంలో 19,167 ఎకరాలను 11,529 మంది రైతులు సాగు చేయగా వీరిలో 8,819 మంది రైతులు 16,536 ఎకరాలను ఈకేవైసీ చేయించారు. 2,710 మంది రైతులు 2,596 ఎకరాలకు ఈకేవైసీ చేయించలేదు. బంటుమిల్లి మండలంలో 12,802 ఎకరాలను 7,187 మంది రైతులు సాగు చేయగా వీరిలో 6,201 మంది రైతులు 12,010 ఎకరాలను ఈకేవైసీ చేయించారు. 986 మంది రైతులు 780 ఎకరాలను ఈకేవైసీ చేయించలేదు. కృత్తివెన్ను మండలంలో 5,656 ఎకరాలను 2,556 మంది రైతులు సాగు చేయగా వీరిలో 2,422 మంది రైతులు 5,443 ఎకరాలను ఈకేవైసీ చేయించారు. 134 మంది రైతులు 199 ఎకరాలను ఈకేవైసీ చేయించడానికి ఆసక్తి చూపలేదు. ఈకేవైసీ చేయించుకోవడానికి ముందుకు రాని రైతుల్లో ఎక్కువగా 20 సెంట్లు, 30 సెంట్లు లేదా కుంటలోపు ఉన్న వారే అధికంగా ఉన్నట్లు వ్యవసాయశాఖ సిబ్బంది, అధికారులు గుర్తించారు.



ఈకేవైసీ చేస్తున్న వీఏఏ శిరీష

85 శాతం వరకు చేశాం



ఈకేవైసీ 85 శాతం వరకు పూర్తి చేశాం. మిగిలిన 15 శాతంలో రైతులు అందుబాటులో ఉండలేదు. కొందరు ఆసక్తి చూపించడం లేదు. వీఏఏలు, ఎంపీఈవోలు పలుమార్లు వెళ్తున్నా ముందుకు రాలేదు. ఇదే విషయాన్ని వారు స్పష్టం చేశారు. కొందరేమో స్థానికంగా ఉండటం లేదు. అదీ కాకుండా చాలా మంది రైతులు 20 సెంట్లు, 15 సెంట్లు భూమి ఉన్న వారు కూడా ముందుకు రాలేదు. ఈకేవైసీ సమయం కూడా మూడు దఫాలుగా గడువు పెంచుతూ వచ్చారు. అక్టోబరు 9వ తేదీతో ముగిసింది.

–నూరున్నీసా, ఇన్‌చార్జి ఏవో, పెడన

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కృత్తివెన్ను: మండలంలోని కృత్తివెన్ను, లక్ష్మీపురం, చెరుకుమిల్లి విద్యుత్ సబ్ స్టేషన్లలో నిర్వహణ పనుల నేపథ్యంలో శనివారం ఉదయం 8 గంటల నుంచి ఉదయం 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆ శాఖ ఏఈఈ జీబీ శ్రీనివాసరావు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

బంటుమిల్లి: శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈఈ శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని బంటుమిల్లి, అర్తమూరు విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వివరించారు.

రేపు నేత్ర వైద్య శిబిరం

పెడన: మండల పరిధిలోని దావోజిపాలెం గ్రామంలో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నట్లు శ్రీవిజయ అమలేశ్వరి దేవి ఆలయ కమిటీ సభ్యులు అంకెం శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకనటనలో తెలిపారు. 20న ఉదయం 10 గంటలకు శ్రీ విజయ అమలేశ్వరి దేవి దేవస్థానం ఆధ్వర్యంలో విజయవాడ పడమటకు చెందిన అశ్విని ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ వారు ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసిందని పేర్కొన్నారు. అవసరమైన వారికి ఆపరేషన్లు చేసి కళ్లజోళ్లు కూడా అందిస్తారని తెలిపారు. విజయవాడ చైతన్య కంటి ఆసుపత్రికి చెందిన వైద్యులు అంకెం శ్రీనివాస్, గీతా శ్రీనివాస్, చైతన్య, అరవింద్, నిఖిల, మీనాక్షి ఈ శిబిరంలో ఉచిత వైద్య సేవలందించనున్నారని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాల్సిందిగా కోరారు.

‘పల్లె పండుగ’తో పంచాయతీల అభివృద్ధి



ఉల్లిపాలెంలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

కృత్తివెన్ను: రాష్ట్ర ప్రభుత్వం పల్లెపండుగ పేరుతో గ్రామ పంచాయతీలలో అభివృద్ధికి బాటలు వేస్తోందని పెడన నియోజకవర్గ ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఇంతేరు, చినపాండ్రాక పంచాయతీలలో ఉపాధిహామీ పథకం నిధులతో సీసీ రోడ్లకు శంకుస్థాపనలు చేశారు. చినపాండ్రాక పంచాయతీలో రూ.20.0 లక్షలు, ఇంతేరు పంచాయతీలో రూ.17.0 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్లు పంచాయతీరాజ్ ఏఈఈ నగేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులతో పాటు, టీడీపీ, జనసేన పార్టీల నాయకులు పాల్గొన్నారు.

కోడూరు: పల్లె పండుగ ద్వారా గ్రామాల్లో సమగ్ర అభివృద్ధి జరుగుతుందని ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ అన్నారు. శుక్రవారం మండలంలోని హరిపురం, లింగారెడ్డిపాలెంలో నూతనంగా నిర్మించే రహదారులకు శంకుస్థాపన చేశారు. లింగారెడ్డిపాలెంలో రూ.52.90 లక్షలతో ఎనిమిది సీసీ రోడ్లు, హరిపురంలో రూ.61.40 లక్షలతో 11 సీసీ రోడ్లు, కోడూరులో రూ.55 లక్షలతో ఆరు సీసీ రోడ్లను నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి పనులు కూడా ప్రారంభిస్తున్నట్లు బుద్ధప్రసాద్ చెప్పారు. మండలంలో 13 పంచాయతీలకు సంబంధించి రూ.4.47కోట్లతో 68 సీసీ రోడ్లను నిర్మించనున్నట్లు తెలిపారు. రత్నకోడు మేజర్ డ్రెయిన్ అభివృద్ధికి రూ.73 లక్షల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ముందుగా రహదారుల నిర్మాణానికి భూమి పూజ చేశారు. గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షుడు మండలి వెంకట్రామ్ (రాజా), శీలం అశ్విన్‌కుమార్, టీడీపీ మండలాధ్యక్షుడు బండే శ్రీనివాసరావు, జనసేన పార్టీ కోడూరు, అవనిగడ్డ మండలాల అధ్యక్షులు మర్రే గంగయ్య, గుడివాక శేషబాబు, డీఈ పగడాల సురేష్‌బాబు, సర్పంచులు వీ పావని, యర్రంశెట్టి శ్రీదుర్గ, ఎంపీడీఓ సుధాప్రవీణ్, ఈఓపీఆర్డీ నాగరేవతి, ఏపీఓ రవికుమార్, నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యూపీహెచ్‌సీని తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో



యూపీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో గీతాబాయి

మచిలీపట్నంటౌన్: నగరంలోని చిలకలపూడిలో ఉన్న యూపీహెచ్‌సీని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జి.గీతాబాయి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. యూపీహెచ్‌సీలో రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై సిబ్బందిని ఆరా తీశారు. హాజరుపట్టీ, పలు రికార్డులను పరిశీలించారు. ల్యాబ్‌లో రోగులకు చేస్తున్న పరీక్షల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. యూపీహెచ్‌సీ సిబ్బంది ఆమెకు వివరాలు తెలిపారు.

స్కానింగ్ కేంద్రం పరిశీలన

జిల్లాలో నూతనంగా ఏర్పాటు చేసిన స్కానింగ్ కేంద్రాలు వైద్య ఆరోగ్యశాఖ వెబ్‌సైట్‌లో అనుమతి కోసం తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి జి.గీతాబాయి అన్నారు. నగరంలోని సాయి జస్విక మెటర్నిటీ హాస్పటల్‌లో ఏర్పాటు చేసిన స్కానింగ్ కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎంఅండ్‌హెచ్‌వో మాట్లాడుతూ జిల్లాలోని అన్ని స్కానింగ్ కేంద్రాలు పీసీపీఎన్‌డీ చట్టం ప్రకారం నమోదు చేసుకోవాలన్నారు. ఎవరైనా లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే చట్టరీత్యా తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అవసరమైతే ఐఎంఏ ఇచ్చిన గుర్తింపును కూడా రద్దు చేస్తామన్నారు. స్కానింగ్ కేంద్రాలకు సంబంధించిన అనుమతులన్నీ తప్పనిసరిగా ఉండాలన్నారు. స్కానింగ్ కేంద్రాలకు వచ్చిన గర్భవతుల పూర్తి వివరాలను అనుమతి తీసుకుని మాత్రమే స్కానింగ్ నిర్వహించాన్నారు. ప్రతి గర్భవతి వివరాలను ఫారం–ఎఫ్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు.

ఉత్సాహంగా ‘సాక్షి’ స్పెల్‌బీ

మచిలీపట్నంటౌన్: ‘సాక్షి’ మీడియా ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని రామానాయుడుపేటలోని శ్రీబాలాజీ విద్యాలయం, పరాసుపేటలోని డాక్టర్ కేకేఆర్ గౌతమ్ స్కూల్‌లో నిర్వహించిన స్పెల్‌బీ పరీక్ష ఉత్సాహంగా కొనసాగింది. ఉదయం ఈ రెండు పాఠశాలల్లో నిర్వహించిన స్పెల్‌బీ పరీక్షలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. శ్రీ బాలాజీ విద్యాలయంలో 17 మంది, డాక్టర్ కేకేఆర్ గౌతమ్ స్కూల్‌లో 31 మంది విద్యార్థులు స్పెల్‌బీకి హాజరయ్యారు. 1 నుంచి 9వ తరగతి వరకు చదివే విద్యార్థులు స్పెల్‌బీలో పాల్గొన్నారు. హాజరైన విద్యార్థులకు ప్రోత్సాహక ధ్రువపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా బాలాజీ విద్యాలయం ప్రిన్సిపాల్ కొమరగిరి చంద్రశేఖర్, కేకేఆర్ గౌతమ్ స్కూల్ ప్రిన్సిపాల్‌ఎంసీహెచ్‌సింహాచలంనాయుడు మాట్లాడు తూ విద్యార్థులకు ఆంగ్లభాషలో నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ‘సాక్షి’ మీడియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్పెల్‌బీ పరీక్ష ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఇంగ్లిషు భాష పట్ల విద్యార్థుల్లో ధైర్యాన్ని నింపి ఏకాగ్రత, ఆలోచన శక్తి పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. విద్యార్థులు మా ట్లాడుతూ మాలో ఉన్న ప్రతిభను నిరూపించుకునేందుకు ఇదొక మంచి అవకాశం అని చెప్పారు.



డాక్టర్ కేకేఆర్ గౌతమ్ స్కూల్‌లో స్పెల్‌బీ పరీక్ష రాస్తున్న విద్యార్థులు



శ్రీబాలాజీ విద్యాలయంలో స్పెల్‌బీ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

సర్దుబాటు చార్జీల భారంపై ఆగ్రహం

కోనేరు సెంటర్‌లో సీపీఎం నేతల ధర్నా

మచిలీపట్నంటౌన్: రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ వినియోగదారులపై సర్దుబాటు చార్జీల భారం మోపడాన్ని నిరసిస్తూ సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన తెలిపారు. స్థానిక కోనేరుసెంటర్‌లో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు, నగర కమిటీ ప్రతినిధులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ వినియోగదారులపై రూ.8,114 కోట్ల సర్దుబాటు చార్జీల భారాన్ని వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఎం రాష్ట్ర పార్టీ పిలుపులో భాగంగా నగరంలో ఈ నిరసన కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. విద్యుత్ వినియోగదారులపై ట్రూఅప్ చార్జీలు, సర్దుబాటు చార్జీల పేరుతో ప్రభుత్వం భారాన్ని మోపుతోందని విమర్శించారు. ఇప్పటికే నిత్యావసర సరుకులు, కూరగాయల ధరలు పెద్ద ఎత్తున పెరిగాయని వీటితో ప్రజలు ఇబ్బందులు పడుతున్న తరుణంలో మళ్లీ వాడిన కరెంటుకు రేట్లు పెరిగాయని ప్రస్తుతం చెల్లించమని సర్దుబాటు చార్జీల పేరుతో భారాలు మోపడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచమని హామీ ఇచ్చిన పాలకులు వంద రోజుల పాలన దాటగానే చార్జీల భారం మోపటం దారుణమన్నారు. మరో పక్క స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలపై మరింత భారాలు వేయటాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఏపీ మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొల్లాటి శ్రీనివాసరావు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.వెంకటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు కేవీ గోపాలరావు, సీపీఎం నగర కార్యదర్శి బూర సుబ్రహ్మణ్యం, జిల్లా కమిటీ సభ్యులు సీహెచ్ రాజేష్, సీనియర్ నాయకుడు కొడాలి శర్మ, కేవీపీఎస్ నగర అధ్యక్షుడు బెనర్జీ, ఐద్వా నగర కార్యదర్శి కొడాలి సుజాత, ఎల్ఐసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకుడు నాగయ్య తదితరులు పాల్గొన్నారు.



కోనేరుసెంటర్‌లో ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

లంక రహదారులపై గుంతలతో ఇక్కట్లు

నాగాయలంక: మండల కేంద్రంగా ఉన్న నాగాయలంకలో పలు అంతర్గత రహదారులు గుంతలమయం కావడంతో ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. ప్రధానంగా స్థానిక హైస్కూలు రోడ్డు పూర్తి అధ్వానంగా మారింది. వర్షాలకు గుంతల్లో నీళ్లు చేరి ఏ గుంత ఎంత లోతు ఉందో తెలియక వాహనదారులు పడిపోతున్నారు. దీంతో జిల్లా పరిషత్ హైస్కూలుకు వెళ్లే బాలబాలికలు సైకిళ్లపై వెళ్లేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. దీనిపై ఇటీవల స్థానిక ఎంపీటీసీ శ్రీనివాసప్రసాద్, మత్స్యకారనేత లకనం నాగాంజనేయులు రోడ్డుపై గుంతలు పూడ్చాలని పంచాయతీకి విన్నవించినా స్పందన లేదంటున్నారు. మళ్లీ వర్షాలకు ఆ గుంతలు చిన్నపాటి జలాశయాలుగా మారాయి. ఇదే మార్గంలో మత్రిపాలెం వంతెన సమీపంలో తూర్పు బజారు రోడ్డు డౌన్ కార్నర్‌లో పెద్ద గుంత ఏర్పడినా పంచాయతీఅధికారులు పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. ఇక్కడ సిమెంట్ రోడ్డు పగులగొట్టి డౌన్‌లో కల్వర్ట్ కట్టి వదిలేయడంతో చాలా ప్రమాదకరంగా మారింది. వర్షం వస్తే ఒక పక్క బురద, మరోవైపు పెద్ద గుంత ఆందోళన కలిగిస్తున్నాయి.



హైస్కూలు రోడ్డులో ప్రమాదకరంగా మారిన గుంతలు

పశువుల చావిడి దగ్ధం

ఘంటసాల: స్థానిక పెద్దగూడెంలో జరిగిన అగ్నిప్రమాదంలో పశువుల చావిడి దగ్ధం అయిన సంఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. అగ్నిమాపక కేంద్రం ఇన్‌చార్జి అధికారి కె.శ్రీనివాసరావు, బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఘంటసాల పెద్దగూడెంకు చెందిన కొడాలి భాస్కరరావు గేదెల చావిడి వద్ద ఉలవల దాలి వలన మంటలు అంటుకుని చావిడికి దగ్ధం అయింది. చావిడిలో కట్టేసి ఉన్న మూడు గేదెలకు తీవ్ర గాయాలయ్యాయి. పక్కనే ఉన్న ఐదు ఎకరాల గడ్డివాము కూడా కాలిపోయింది. స్థానికులు వెంటనే స్పందించి పశువుల పాకలో నిద్రిస్తున్న వృద్ధుడు భాస్కరరావును బయటకు తీసుకురావడంతో ప్రాణాపాయం తప్పింది. మొవ్వ ఫైర్ స్టేషన్ ఇన్‌చార్జి అధికారి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో లీడింగ్ ఫైర్‌మాన్ టి.నాగప్రసాద్, హోంగార్డు జి.నాగరాజు, స్థానిక యువకులు మంటలను అదుపు చేశారు. గేదెలకు స్థానిక పశువైద్యశాలలో సిబ్బంది చికిత్స అందిస్తున్నారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.3 లక్షల ఆస్తి నష్టం జరిగినట్టు బాధితులు తెలిపారు.

మత్స్యకార కుటుంబాలకు నిత్యావసరాలు

ఎదురుమొండి(నాగాయలంక): మండలంలోని ఎదురుమొండి దీవిలో ఎదురుమొండి, ఏసుపురం, బ్రహ్మయ్యగారిమూల, కృష్ణాపురం గ్రామాల్లో వెయ్యిమంది వరద ప్రభావిత మత్స్యకార కుటుంబాలకు అసిస్ట్ స్వచ్ఛంద సేవాసంస్థ ద్వారా నిత్యావసర సరుకుల కిట్స్ శుక్రవారం పంపిణీ చేశారు. ఆయా గ్రామాలలో జరిగిన కార్యక్రమాలలో ఫీడింగ్ ఇండియా (ఏ జుమాటో గివ్ బ్యాక్) ఆర్థిక సౌజన్యంతో అసిస్ట్ ఆధ్వర్యంలో వెయ్యి రూపాయల విలువైన ఒక్కో కిట్ వెయ్యి కుటుంబాలకు సంస్థ డీడీ ఎంవీ రామారావు, గ్రామ సర్పంచ్ కన్నా సుధకీర్తన చేతులు మీదుగా అందచేసారు. ఒక్కో కిట్‌లో అయిదు కేజీల బియ్యం, రెండు కేజీల నూనె, కేజీ కందిపప్పు, బిస్కెట్లు ఉన్నట్లు సంస్థ ప్రతినిధి చెప్పారు. కార్యక్రమంలో అసిస్ట్ ఏరియా కోఆర్డినేటర్ దారా వెంకట్రావు, జి.కనకదుర్గ, రాణి, విడీఎస్ కమిటీ సభ్యులు, గ్రామాల పెద్దలు పాల్గొన్నారు.



వరద బాధితులకు సాయం అందిస్తున్న అసిస్ట్ డీడీ రామారావు

బాణసంచా దుకాణాలకు లైసెన్స్‌లు తప్పనిసరి

బందరు డీఎస్పీ అబ్దుల్ సుభాన్

కోనేరుసెంటర్: దీపావళికి బాణసంచా దుకాణాల నిర్వహణకు వ్యాపారులు తప్పనిసరిగా లైసెన్స్‌లు కలిగివుండాలని బందరు డీఎస్పీ అబ్దుల్ సుభాన్ తెలిపారు. లైసెన్స్‌లు లేకుండా విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పోలీసు, రెవెన్యూ అధికారులు సూచించిన ప్రాంతంలో మాత్రమే దుకాణాలు పెట్టుకోవాలన్నారు. బందరు ఆర్డీవో ద్వారా లాటరీలో షాపులు దక్కించుకున్న వ్యాపారులు మాత్రమే దుకాణాలు పెట్టి బాణసంచా అమ్ముకోవాల్సి ఉంటుందన్నారు. బందరు సబ్ డివిజన్ పరిధిలోని పెడనలో అనుమతులు లేకుండా బాణసంచా విక్రయిస్తున్న ఆరుగురుపై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. గుడివాడ సబ్‌డివిజన్‌లో మరో ఎనిమిది కేసులు నమోదు చేశామన్నారు. ఈ కేసుల్లో సీజ్ చేసిన బాణసంచాను కృత్తివెన్నుకు దగ్గరలో ఉన్న మ్యానుఫ్యాక్చరింగ్ గోడౌన్‌లో నిల్వ ఉంచామన్నారు. దుకాణదారులు నీరు. ఇసుక, ఫైర్ ఎగ్జిట్స్ పరికరాన్ని అందుబాటులో ఉంచుకోవాలన్నారు. సబ్ డివిజన్ పరిధిలో లైసెన్స్‌లు లేకుండా ఎవరైనా బాణసంచా విక్రయిస్తున్నట్లు సమాచారం ఉంటే వెంటనే సంబంధిత పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. పిల్లలు బాణసంచా కాల్చేటపుడు తల్లితండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రమాదాలకు ఆస్కారం లేకుండా ప్రతి ఒక్కరూ దీపావళి పండుగను సంతోషంగా జరుపుకోవాలన్నారు. ఈ సమావేశంలో చిలకలపూడి సీఐ నబీ, పెడన సీఐ నాగేంద్రప్రసాద్ పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ అబ్దుల్ సుభాన్

కిడ్నీ బాధితుడికి ఆర్థిక సాయం

చల్లపల్లి(అవనిగడ్డ): చల్లపల్లికి చెందిన కిడ్నీ బాధితుడు అబ్దుల్ సుభాన్‌కు పినిశెట్టి నిరంజన్ ఫ్రెండ్ సర్కిల్ రూ.20,500 ఆర్థిక సహాయం అందించారు. ఈ మొత్తాన్ని అబ్దుల్ సుభాన్ కుటుంబ సభ్యులకు శుక్రవారం అందించారు. చల్లపల్లి వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యురాలు తోట కనకదుర్గ, ఆకుల రవి, కాజా చేతన్‌బాబు, పలువురు ఫ్రెండ్ సర్కిల్ సభ్యులు పాల్గొన్నారు.

జస్టిస్ లక్ష్మణరావు మరణవార్త దిగ్భ్రాంతి కలిగించింది

ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

అవనిగడ్డ: అలహాబాద్ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అంబటి లక్ష్మణరావు మరణ వార్త తనను తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చెప్పారు. కృష్ణా డెల్టా ఉద్యమంలో ఆయన అందించిన సహకారం మరువలేనిదన్నారు. బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ తీర్పు ఆంధ్రప్రదేశ్ హక్కులకు భంగం కలిగినపుడు అంబటి లక్ష్మణరావు అధ్యక్షతన కమిటీ ఏర్పరచి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారన్నారు. ఈ నివేదిక ఆధారంగానే రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్లి స్టే తీసుకొచ్చిందని చెప్పారు. రెడ్‌క్రాస్ చైర్మన్‌గా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారని ఆయన మరణం తనను తీవ్రంగా కలచివేసిందన్నారు.

రీ సర్వేలో సమస్యల పరిష్కారానికే గ్రామ సభలు

గూడూరు: వ్యవసాయ భూముల రీసర్వే ప్రక్రియలో తలెత్తిన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు డి.రాజ్యలక్ష్మి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రీ సర్వే ప్రాజెక్టులో చేపట్టిన రీసర్వేలో వచ్చిన భూ సమస్యల పరిష్కారంలో భాగంగా శుక్రవారం మండలంలోని గంద్రం గ్రామంలో తహసీల్దారు గ్రామసభ నిర్వహించి రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ గ్రామసభలలో రైతులు తాము ఎదుర్కొన్న సమస్యలు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఫిర్యాదులను 15రోజుల్లో పరిష్కారం చేస్తామన్నారు. రీ సర్వే డీటీ కె.జ్ఞానసాయి, మండల సర్వేయరు కె.మురళీకృష్ణ, వీఆర్వో సుబ్బారావు, గ్రామ సర్వేయరు నవీన్, రైతులు పాల్గొన్నారు.

గ్రామ సభల వివరాలు

ఈనెల 19న రామన్నపేట, 21న కోకనారాయణపాలెం, 22న కంచాకోడూరు, 23న రాయవరం, 24న రామానుజవత్తర్లపల్లి, 25న జక్కంచర్ల, 26న కప్పలదొడ్డి, 28న లేళ్లగరువు, 29న ఐదుగుళ్లపల్లి, 30న పినగూడూరులంక, అక్టోబరు 1న కంకటావ, 2న మద్దిపట్ల గ్రామాల్లో సభలు ఉంటాయని తహసీల్దారు తెలిపారు.